ప్రజాశక్తి
బుధవారం 23 ఏప్రిల్ 2025
5
విజయనగరం



సివిల్స్‌లో భార్గవ్‌కు 830వ ర్యాంకు

ప్రజాశక్తి-రాజాం



సివిల్ సర్వీసెస్ (యుపిఎస్‌సి) ఫలితాల్లో రాజాం మండలం సారధి గ్రామానికి చెందిన వావిలపల్లి భార్గవ 830వ ర్యాంకు సాధించారు. తన జీవిత లక్ష్యం సివిల్స్ అని ఇంట్లో ఉంటూ చదివి, ఇప్పటివరకూ నాలుగుసార్లు యుపిఎస్‌సి ఇంటర్వ్యూకి హాజరైన భార్గవ, తన నాలుగవ ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్‌కి సెలక్టయ్యారు. ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖ పిడుగురాళ్ల సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ ట్యాక్స్)గా భార్గవ పనిచేస్తున్నారు. భార్గవ తండ్రి వావిలపల్లి విష్ణు పాఠశాల హెచ్ఎం కాగా, తల్లి ఈశ్వరమ్మ గృహిణి. రాజాంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. జిఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇఇఇ పూర్తి చేశారు. 2017 నుంచి 2019 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసోసియేట్‌గా పనిచేశారు.

దోచేస్తున్నారు..



గోపాలపురం- బొడ్డవలస సమీపం నాగావళి నదిలో జెసిబితో తవ్వి తీస్తున్న ఇసుక

- నాగావళి నదిలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- గోపాలపురం వద్ద భారీగా తవ్వకాలు
- బొడ్డవలస, రేగిడి, తునివాడ కేంద్రాలుగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-రేగిడి

ఉచితమే కదా అని నాగావళి నదిలో ఇసుకను పాలకుల అండదండలతో కొంతమంది దోచేస్తున్నారు. రేగిడి మండలం గోపాలపురం వద్ద జెసిబిల ద్వారా రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో జరుగుతున్న ఈ దోపిడీపట్ల మైనింగ్, పోలీస్ ,రెవెన్యూ శాఖాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఇసుకాసురులు లక్షలాది రూపాయలు పోగేసుకుంటున్నారు. ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయని సంబంధిత గ్రామాల ప్రజలు అంటున్నారు.

రేగిడి మండలంలోని గోపాలపురం, బొడ్డవలస, రేగిడి, తునివాడ, ఖండ్యాం, కొమిరి గ్రామాల పరిధిలో నాగావళి నదిలో రోజూ యథేచ్ఛగా అక్రమార్కులు ఇసుక జెసిబిలతో తవ్వేస్తున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను తవ్వేసి రోజూ వందలాది ట్రాక్టర్లు, లారీలతో పట్టణాలకు తరలిస్తున్నారు. రాత్రిపూట జెసిబిలతో ఇసుక లారీలతో విజయనగరం, విశాఖపట్నం, చెన్నై వంటి పట్టణాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తో ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు ఇసుకాసురులు రూ.5వేల నుంచి రూ.7వేలు వరకు విక్రయిస్తున్నారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఈ ఇసుక అక్రమ రవాణా పట్ల పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు కనీసం పట్టించుకోకపోవడంతో వీరికి ముడుపులు అందుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. నాగావళి నదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. అ ఇసుక అక్రమ రవాణా వెను క అధికార పార్టీ నాయ కుల హస్తముందని గ్రామస్తులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఇసుక తవ్వకాలతో దెబ్బతిన నున్న తాగునీటి పథకం

తాగునీటి పైలట్ ప్రాజెక్టులు, వంతెనలకు ముప్పు

రేగిడి మండలం సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస వద్ద రూ.49కోట్లతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూడు పైలెట్ ప్రాజెక్టులు ఏడు మండలాలకు తాగునీటిని సరఫరా చేసే మూడు పైలట్ ప్రాజెక్టులు నిర్మించారు. విశాఖపట్నం -పాలకొండ వెళ్లే ప్రధాన రహదారి సంకిలి నాగవల్ల వద్ద పెద్ద వంతెన ఉంది. ఇసుక తవ్వకాలు 500 మీటర్ల లోపు ఎటువంటి అనుమతులనూ అధికారులు ఇవ్వరు. అలాంటిది ఉచిత ఇసుక వల్ల ఎక్కడబడితే అక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టి పట్టణాలను తరలిస్తున్నారు. తవ్వకాలో తాగునీటి పథకాలు, వంతెన దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

బొడ్డవలస సమీపంలో ట్రాక్టర్లతో ఇసుక రవాణా



గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర సస్యశ్యామలం

రామతీర్థసాగర్‌ను పూర్తి చేస్తాం ● సూక్ష్మ, మధ్య తరహ, భారీ ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల

ప్రజాశక్తి-విజయనగరం, గుర్ల

పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేసి గోదావరి నదీ జలాలతో ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ జూన్ నాటికి పూర్తి చేసి గోదావరి నుండి వంశధార వరకు అనుసంధానం చేయడం ద్వారా ఉత్తరాంధ్రకు సాగు నీరందిస్తామన్నారు మంగళవారం మంత్రి గుర్ల మండలం ఆనందపురం వద్ద నిర్మాణంలో ఉన్న రామతీర్థసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టువద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను, మ్యాపులను తిలకించారు. ప్రాజెక్టు ఇంజినీర్లతో కలసి బ్యారేజ్‌ను పరిశీలించారు. ప్రజలనుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. విజయనగరానికి తాగునీరు, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, సుమారు 20వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో అవసరమని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో బ్యారేజ్ పనులు 90 శాతం పూర్తయినప్పటికీ, గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. నిర్వహణ సైతం చేపట్టక పోవడంతో, ప్రాజెక్టు గేట్లు, ఇతర నిర్మాణాలు తుప్పుపట్టిపోయాయని తెలిపారు. ప్రాజెక్టు డైవర్షన్ కెనాల్ 60శాతం, సొరంగం పనులు 20శాతం పూర్తి అయ్యాయని చెప్పారు. సుమారు 2.7టిఎంసిల నీటిని నిల్వ ఉంచే రిజర్వాయర్ మట్టిగట్టు నిర్మాణ పనులు 60శాతం మేరకు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆర్ అండ్ఆర్ కింద దాదాపు రూ.175 కోట్లు పెండింగ్ ఉందని, దానిని చెల్లిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జలవనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

అనంతరం కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ అధికారులతో ప్రాజెక్టులపై మంత్రి సమీక్షించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ కుమిలి, సారిపల్లిలో ఆర్అండ్ఆర్ వేగవంతం చేయాలని కోరారు. రాజం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో 25వేల ఎకరాలకు సాగు నీరందవలసి ఉండగా 20వేల ఎకరాలకు మాత్రమే సరఫరా జరుగుతోందని, లస్కర్లను నియమించాలని మంత్రిని కోరారు. తోటపల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించి పార్వతీపురం డివిజన్‌లో 8 పనులు, రాజాం, చీపురుపల్లిలో 4పనులు జరుగుతున్నాయని, ఏయే దశలలో ఉన్నాయని సంబంధిత అధికారులను మంత్రి ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు పని చేయకపోతే నోటీసు లు జారీ చేసి, బ్లాక్‌లిస్టులో పెట్టాలని, పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అధికారుల పై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. మడ్డువలస జలాశయం సమీక్ష లో పూడిక తీత , లైనింగ్, గుర్రపుడెక్క తొలగింపునకు ప్రతిపాదనలు పంపినట్లు డిఇ తెలుపగా ఈ ప్రాజెక్ట్ పరిధిలో 5 వేల ఎకరాల్లో గుర్రపు డెక్క తొలగింపు అత్యవసరమని ఎమ్మెల్యే కొండ్రు మురళీ తెలిపారు. మంత్రి స్పందిస్తూ గుర్రపు డెక్క తొలగింపునకు డ్రోన్ల ద్వారా స్ప్రే చేయడం సులువైన మార్గమని తెలిపారు. గజపతినగరం కెనాల్ ప్రీ క్లోజర్ అయ్యిందని, పర్యటనలో మంత్రి వెంట ఎమ్మెల్యేలతో పాటు మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, తారకరామ తీర్థసాగర్ ఎస్ఇ స్వర్ణకుమార్, ఆర్‌డిఒలు సత్యవాణి, డి.కీర్తి, టిడిపి నాయకులు కిమిడి నాగార్జున, కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, ఇఎన్‌సి ఎం.వెంకటేస్వర్రావు, నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్ డి.రాం గోపాల్, విజయనగరం బొబ్బిలి ఎస్ఇలు స్వర్ణ కుమార్, అప్పారావు, ప్రాజెక్టుల డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.



రామతీర్థ సాగర్ ప్రాజెక్టు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

మే నెలాఖరులోగా సారా రహిత జిల్లా



- ముడిసరుకుల అమ్మకాలపై దృష్టి పెట్టాలి
- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 14405
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

మే 31 నాటికి సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ కోరారు. నాటు సారాకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 14405 కు విస్తత ప్రచారం కల్పించాలని సూచించారు. ఎపి ప్రభుత్వ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో నాటుసారా నిర్మూలన సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, గ్రామాల్లో ఎక్కడా సారా తయారీ గానీ, వినియోగం గానీ జరగడం లేదని అన్ని పంచాయితీల నుంచి తీర్మానాలు తీసుకొనే ప్రక్రియను మే 15లోగా పూర్తి చేయాలని కోరారు. మండలాల నుంచి తీర్మానాలను కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యంగా అన్ని గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలను విస్తతంగా నిర్వహించాలని ఆదేశించారు. సారా తయారీ, రవాణా, విక్రయాలపై మరింత నిఘా పెట్టాలని, అలాగే ముడి పదార్థాల కొనుగోలు, రవాణాపైనా దృష్టి సారించాలని సూచించారు. సారా తయారీ, అమ్మకాల వృత్తి నుంచి బయటపడిన 56 కుటుంబాలకు రుణాలు, ఆటోలు తదితర ఉపకరణాలను అందజేసేందుకు కార్యక్రమాన్ని రూపొందించాలని ఆదేశించారు. ఏ గ్రామంలోనైనా గ్రామసభ పెట్టి తీర్మానం తీసుకున్న తరువాత కేసు నమోదు కాకూడదని స్పష్టం జెసి చేశారు.

జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమం అమలు, తీసుకున్న చర్యలను ఎక్సైజ్ సూపరింటిండెంట్ బి.శ్రీనాథుడు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, డిఎస్‌పి వీరకుమార్, అబ్కారీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

ఆయుష్మాన్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సబ్ సెంటర్లు, పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సిహెచ్ఒ) ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యములో కలెక్టరేట్ వద్ద ఆయుష్మాన్ ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు ధర్నాకు సిహెచ్ఓ ఉద్యోగులు తేజస్విని, మౌనిక, తరుణ్, ప్రసన్న తదితరులు నాయకత్వం వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆరేళ్లకు పైగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఆరోగ్య శాఖలో ప్రజలకు సర్వీస్ అందించడంలో సిహెచ్ఒలు కీలకంగా పనిచేస్తున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫేస్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఇతర పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరపాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్దీకరించాలని, పిఎఫ్ఒ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్దీకరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు ఉత్పాదక సంఘాల ద్వారా విత్తనాభివృద్ధి

వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పివి సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ పరశోధన సంచాలకులు పివి సత్యనారాయణ

రైతు ఉత్పాదక సంఘాల ద్వారా ఉత్తరకోస్తాలో విత్తనాభివృద్ధి చేయాలని వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పివి సత్యనారాయణ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న ఉత్తరకోస్తా పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశంలో రెండో రోజు మంగళవారం విత్తన అభివృద్ధిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, ఉత్తరకోస్తా జిల్లాల్లో ముఖ్యంగా అనకాపల్లి, విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కావలసిన వరి, నువ్వులు, వేరుశెనగ, గోగు, కట్టె జనుము, చిరుధాన్యాలకు రైతులే ఉత్పత్తి దారుల సంఘాలుగా తయారై, విత్తనాభివద్ధి చేసుకొని అవసరమైన విత్తనం తయారు చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న కమతాలకు జపాన్, చైనా పనిముట్ల నమూనాలు, యాంత్రికరణ వాడాలన్నారు. అనంతపురం నుంచి వచ్చిన డాక్టర్ విజయశంకబాబు మాట్లాడుతూ, జిల్లాలలో ఉన్న చెరువులన్నిటి నుండి చెరువు మట్టిని పొలంలో వాడాలని సూచించారు. నేలలో చిసెల్ నాగలితో వేసవి దుక్కులు దున్నాలని చెప్పారు. రాష్ట్ర వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యు.గిరిజారాణి మాట్లాడుతూ, సన్న రకాలు, మధ్యస్థ మినికిట్ రకాలు ఆర్‌జిఎల్ 7034, 7039 రానున్న రోజుల్లో రాగోలు పరిశోధనా స్థానం నుండి అందుబాటులోకి వచ్చే అవకాశముందని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువు వేసి మాత్రమే తొలకరిలో పరి సాయం చేయాలని సూచించారు. సదస్సులో రాష్ట్ర స్థాయి పప్పు జాతుల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి. మోహన్ రెడ్డి, నూనెగింజలు ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయా పంటల దిగుబడి పెంచేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పాత్రో, డాక్టర్ కె.లక్ష్మణ, నాలుగు జిల్లాల నుంచి ఎడిఎలు, వ్యవసాయ,అనుబంధరంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

పేదలు నివాసమున్న చోటే పట్టాలివ్వాలి

సిపిఎం నాయకులు శంకర్రావు

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 30 ప్రకారం గొడగలవీధి లో 60ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లకు 2సెంట్లు ఉచితంగా రెగ్యులర్ చేసి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన పేదలు ధర్నాచేశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ పేదలకు తెచ్చిన జీవోను పెద్దలు ఉపయోగించు కోకుండా చూడాలని ఆయన కోరారు. గొడగలవీధిలో పేదలు ఇళ్లు తొలగించి ఒక వ్యక్తి 20ఏళ్ల క్రితం ఆక్రమించాలని ప్రయత్నం చేస్తే ఆనాడు సిపిఎం ఆధ్వర్యాన అడ్డుకున్నామన్నారు. పట్టాలివ్వాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా నేటివరకు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం జారీచేసిన జీవో 30 ప్రకారం నివాసం ఉంటున్న వారికి ఆధీన స్థలంలోనే రెగ్యులర్ చేయాలని కోరారు. పేదలు ఆక్రమించు కుంటే రెగ్యులరైజ్‌చేస్తున్న అధికారులు పేదలకు ఎందుకు న్యాయం చేయరని ప్రశ్నించారు. ఇప్పటికైనా పేదల స్థలాలకు పట్టాలిచ్చి రెగ్యులరైజ్ చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణ, రాజు. నాగరాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులకు డిఎస్‌సిలో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల



నిరసన తెలుపుతున్న డైట్ విద్యార్థులు

2023-25 డైట్ విద్యార్థులకు మెగా డిఎస్‌సిలో అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరారు. మంగళవారం డైట్ కళాశాలలో 2023-25 డైట్ విద్యార్థులు సమావేశం నిర్వహించి మెగా డిఎస్‌సిలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-25 డిఇడి విద్యా సంవత్సరం ఈ నెల 23తో పూర్తి చేశామని, మూడు సెమిస్టరు పరీక్షలు కూడా పూర్తి అయ్యాయి కాబట్టి ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో అవకాశం కల్పించాలని కోరారు. 4వ సెమిస్టర్ పరీక్ష మే నెల మొదటి వారంలో రాస్తున్నామని, మెగా డిఎస్‌సి, టెట్, డిఎస్‌సి పరీక్షలు రాయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. తమ తలిదండ్రులు మెగా డిఎస్‌సిలో అవకాశం వస్తుందని ఆశగా ఈ కోర్సులో జాయిన్ చేసారని, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ డిఎస్‌సిలో అవకాశం కల్పించాలని సంతకాలతో కూడిన విజ్ఞప్తి పత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డైట్ విద్యార్థులు వి. ప్రతీక్ష, టి.త్రివేణి, ఎం.అనిత, వి.మహేష్, మూసా షరీఫ్, పి. వాహిని, జి. దివ్య, పి. హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ టీచర్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఆర్ట్స్ టీచర్ కుమార్‌ను సత్కరిస్తున్న డిఇఒ, పాఠశాల హెచ్ఎం

గరివిడి మండలం కాపు శంభాం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆర్ట్స్ టీచర్ అద్దాల కుమార్ ఎంఎఫ్ ఎ-4 ఇంటర్నేషనల్, నేషనల్ అవార్డు సాధించినందుకు 30కు పైగా ఎగ్జిబిషన్లు, ఆర్ట్ వర్కుషాప్‌లలో ప్రతిభ కనబరిచ్చినందుకు డార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. ఈనేపథ్యం లో ఆయనను డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు మంగళవారం సత్కరించారు. ఆయనకు సమగ్ర శిక్ష సిబ్బంది, కాపుసంభం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రాము అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ శ్రీనివాసమూర్తి

పాలీసెట్‌కు ఏర్పాట్లు : డిఆర్ఒ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 30న జరుగనున్న పాలిటెక్నికల్ ఎంట్రన్స్ టెస్టుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పాలీసెట్ ఏర్పాట్లపై మంగళవారం తన కార్యాలయంలో జిల్లా లైన్ విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఈనెల 30న బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగనుందని తెలిపారు. సుమారు 8083 మంది అభ్యర్థులు 23 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారని చెప్పారు. విజయనగరంలో 9 కేంద్రాల్లో 3928 మంది అభ్యర్థులు, బొబ్బిలిలో 6 కేంద్రాల్లో 1931 మంది అభ్యర్థులు, గజపతినగరంలో 8 కేంద్రాల్లో 2224 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల కు అవసరమగు బస్సు లను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులకు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖాదికారులకు సూచించారు. వేసవి ని దష్టి లో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సకు అవసరమైన మందులను, ఒఆర్ఎస్ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒకు ఆదేశించారు. రెవిన్యూ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలనీ, డిఇఒకు, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ కమీషనర్లకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలనీ పోలీస్ శాఖకు సూచించారు. సమావేశంలో ఆర్‌టిసి, విద్యుత్, పోలీస్, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్లు టిడిపిలో చేరిక

రామభద్రపురం: మండలంలోని గొల్లపేట పంచాయతీ అప్పలరాజుపేటకు చెందిన ముగ్గురు వార్డు మెంబర్లు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. మీసాల తిరుపతమ్మ, పెనుమజ్జి గౌరినాయుడు, కొండపల్లి శారదతో పాటు సీనియర్ నాయకులు అల్లాడ ఆదినారాయణ వైసిపిని వీడి మంగళవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబినాయన సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి బేబినాయన కండువాలు వేసి ఆహ్వానించారు. రాష్ట్రంలో టిడిపి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైసిపిని వీడి టిడిపిలో చేరుతున్నట్టు బేబినాయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.తిరుపతి, పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు

బాడంగి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షొత్, పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ గౌరమ్మ గర్భిణులను బాలింతలకు పరిసరాల పరిశుభ్రత పోషక విలువలతో ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరు నెలలు దాటిన పిల్లలకు పోషకాహారం పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

రామస్వామిపేటలో రీసర్వే

వేపాడ: రెవెన్యూ అధికారులు మండలంలోని రామస్వామిపేటలో మంగళవారం భూముల రీ సర్వే చేశారు. ఈ సర్వేలో రైతుని మడి దగ్గరే ఉంచి వివరాలు సేకరిస్తున్నారు. అప్పటికే ఉన్న భూ స్థితిని రికార్డులో నమోదు చేస్తున్నారు. రీ సర్వే సక్రమంగా చేపట్టాలని రైతుల మధ్య వివాదాలు లేకుండా చూడాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ అధికారులు, సర్వే సిబ్బందిని కోరారు.

కెజిబివిని సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కెజిబివి బాలికల వసతి గృహాన్ని ఎంఇఒ పి.బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. వసతి గృహం పరిసరాల పరిశీలన, కిచెన్ గార్డెన్, స్టోర్ రూములను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వేసవి సెలవులు అనంతరం పదో తరగతిలోకి రావలసిన విద్యార్థులు వేసవి సెలవుల్లో ఏమి చదువుతున్నారో వివరాలను డైరీలో రాసుకోవాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ కిరణ్మయి, వసతి గృహ ఉపాధ్యాయులు ఉన్నారు.



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలను చేర్పించాలని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు జాకేరులో ప్రచారం చేస్తూ పిల్లల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్దలు బుద్ధ అప్పలనాయుడు, ఉప సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి ఉపాధ్యాయులు ఉపాధి పనుల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఈ ఏడాది పాఠశాలలో చేరేందుకు 9 మంది ముందుకు వచ్చారు. ఈ ప్రచారంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఎం.జగన్నాథరావు, సిఆర్‌పి కాటపల్లి రాంప్రసాద్, మొబలైజేషన్ ఇంఛార్జి ఆతవ రవిశంకర్, స్కౌట్, గైడ్స్ ఇంఛార్జి వి.రమేష్ నాయుడు, గోవిందరావు, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దాతలు భోజనం వితరణ

ప్రజాశక్తి-విజయనగరం



భోజనం అందిస్తున్న రవీంద్ర దంపతులు

వివాహ వార్షికోత్సవం సందర్భంగా దాతలు వృద్ధులకు భోజనం వితరణగా అందజేశారు. ఎ. రవీంద్ర, సునీత దంపతులు 21వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కుటుంబం సభ్యులతో కలిసి విజయనగరం ప్రదీప్‌నగర్‌లోని వెంకట సాయి వృద్ధాశ్రమంలో భోజనం వితరణ అందజేశారు. ఈ సందర్భంగా దాత రవీంద్ర మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చెప్పడతామన్నారు. ఆశ్రమం నిర్వాహకులు కె.ఆంజనేయులు మాట్లాడుతూ వృద్ధులు చిన్నపిల్లలతో సమానమని వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమం లో పిల్లలు సాయి లిఖిత, సాయి వర్షిణి పాల్గొన్నారు.

రఘుమండలో ఆరోగ్య పరీక్షలు

డెంకాడ: ఇంటెన్సిఫైడ్ అనిమియా ఫ్రీ విలేజ్ కాంపెయిన్‌లో భాగంగా మండలంలోని రఘుమండ గ్రామంలో బుధవారం ఆరు మాసాలు దాటిన వారందరికీ రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఐదు రోజులు పాటు రోజుకు వంద ఇల్లులు చొప్పున 5 రోజుల్లో మొత్తం 450 ఇల్లులు పూర్తి చేస్తామని డిఐఒ డాక్టర్ అచ్యుతకుమారి చెపాప్రఉ. రక్త హీనతతో బాధపడుతున్న వారికీ ఐరన్ మాత్రలు మూడు నెలలు వరకు ఇస్తామన్నారు. అనంతరం స్టాఫ్‌కు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ సిహెచ్. సత్యనారాయణ, ఎంపిహెచ్‌ఎస్ యస్.సూరిబాబు, ఎఎన్‌ఎం రాజేశ్వరి, సుభద్ర, ఆశా కార్యకర్తలు గౌరీ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

తెర్లాం: అనారోగ్యంతో బాధపడుతున్న లోచర్ల గ్రామానికి చెందిన మద్రాపు లక్ష్మణరావుకు రూ.45వేలు సిఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే బేబినాయన మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు. నందిగాం గ్రామానికి చెందిన మద్రాపు చంటికి రూ.97వేలు చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న సూర్యనారాయణ దంపతులు

మాజీ జెడ్‌పిటిసి దంపతుల భారీ వితరణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం గ్రామంలో వచ్చేనెల 12,13,14 తేదీలలో పైడితల్లమ్మ పండగ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ పండగకు మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, రాజు దంపతులు గుడి అభివృద్ధి, పండగ మహోత్సవానికి రూ.5.03లక్షల భారీ విరాళాన్ని వితరణగా మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని పండగ కమిటీ సభ్యులకు ఇచ్చారు. గుడి అభివృద్ధితోపాటు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

నెల్లిమర్ల: సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ, సబ్ స్టేషన్ 33/11 కెవి ఎస్-ఎస్ హెచ్ క్యూ ఫీడర్, రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్ వ్యవసాయ కనెక్షన్ నిర్మాణ పనుల పొడిగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం విద్యుత్తును నిలుపుదల చేస్తామన్నారు. మధుపాడ, పినతరిమి,పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు

రాష్ట్ర స్థాయిలో రెండు పతకాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వికలాంగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో మండల కేంద్రానికి చెందిన కందివలస సంతు బంగారం, వెండి పతకాలు సాధించాడు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు, రాష్ట్ర స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో హెల్ పారడైజ్ స్కూల్ అగిరిపల్లి, ఏలూరులో రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ -2025 క్రీడా పోటీలు ఈ నెల 21 నుండి రెండు రోజులు పాటు నిర్వహించారు. ప్రజ్ఞ వైకల్యం, ఆటిజం, డౌన్ సిండ్రోమ్, మస్తిష్క పక్షవాతం వైకల్యాలు గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు జరిగిన ఈ పోటీలలో జిల్లా నుండి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. మంగళవారం రెండవ రోజు జరిగిన ఈ పోటీలలో సంతు 100, 200 మీటర్ల పరుగు పందెం విభాగంలో వరుసగా బంగారం, వెండి పతకాలు సాధించాడు. సంతు పూసపాటిరేగ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా సంతును జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్త ఏ రామారావు, ఇతర ఉన్నత అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది అభినందించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు కోచ్‌లుగా స్పెషల్ ఎడ్యుకేటర్లు సునీల్, బంగారునాయుడు వ్యవహరించారు.



పతకాలు సాధించిన సంతును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి విద్యార్థికి బంగారు పతకం

బాడంగి: విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో బాడంగి హైస్కూల్‌కు చెందిన రాజాన అజయ్ బంగారు పతకం సాధించాడు. సర్వశిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ పోటీలు విజయవాడలో నిర్వహించాయి. అజయ్ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అజయ్‌ను ఐఇఆర్‌టి టీచర్ ఈశ్వరరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

డిఎస్‌సి ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆనందం : కిమిడి

ప్రజాశక్తి - చీపురుపల్లి



మాట్లాడుతున్న నాగార్జున

డిఎస్‌సి ప్రకటన విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతుందని విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం చీపురుపల్లిలో ఉన్న తన ఇంటి వద్ద విలేకరులతో నాగార్జున మాట్లాడారు. గత ఐదేళ్ళ వైసిపి పాలనలో ప్రభుత్వ కొలువుల భర్తీ చేపట్టకపోవడం వల్ల నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉండేవారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 16,346 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి ప్రకటన విడుదల చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో 583 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. డిఎస్‌సి ప్రకటన విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు నాగార్జున జిల్లా యువత తరపున ధన్యవాదాలు తెలిపారు.

మన భూమిని మనమే కాపాడుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి



మొక్కలను పంపిణీ చేస్తున్న జెసి రాజు

మనభూమిని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని, భూ పరిరక్షణ కోసం ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జెసి రాజు అన్నారు. మంగళవారం కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా ప్రాంగణంలో ప్రపంచ భూ పరిరక్షణ దినోత్సవం నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ భూమి మానవులకే కాదు కోట్లాది జీవరాసులకు, మొక్కలకు నిలయం అని, నేలపై ఏ జీవి అయిన ప్రాణంతో ఉండాలంటే గాలి, నీరు, ఆహారం ముఖ్యమని వీటన్నింటికి మూలం భూమని అన్నారు. భూమిని నాసనం చేస్తుంటే ఈ వనరులు అన్ని తరిగి పోయి భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటాయన్నారు. ఇప్పటికే వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నాయని, ఓజోన్ పొర దెబ్బతిన్నదని దీని ఫలితంగా తీవ్రమైన ఎండలు, భారి వర్షాలు విపరీతమైన చలి, వరదలు, భూకంపాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఇవన్నీ మనిషి జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని అన్నారు. ఇకనైనా ప్రజలు ఏకతాటిపైకి వచ్చి జీవవైవిధ్యం, భూ గ్రహాన్ని రక్షించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి యుగంధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సారిపల్లికి పునరావాస ప్యాకేజి ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి గ్రామానికి ఆర్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని మంత్రి నిమ్మల రామానాయుడిని టిడిపి నేతలు కోరారు. మంగళవారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో మంత్రిని ఎమ్మెల్యే లోకం నాగమాదవి, మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్, నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజుతో కలిసి టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, గ్రామస్థులు సారిపల్లి గ్రామానికి ఆర్‌ఆర్ ప్యాకేజి ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా తారకరామతీర్థ ప్రాజెక్టు వల్ల సారిపల్లి గ్రామం తీవ్రంగా నష్టపోయిందని, భూములు కోల్పోయిన వారికి ఉపాధి లేకుండా పోయిందని తెలిపారు. భూములు కోల్పోయిన సారిపల్లి గ్రామస్థులకు ఊరు ఒక్కటే మిగిలిందని తెలిపారు. ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయిన సారిపల్లి గ్రామానికి ఆర్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని మంత్రిని కోరారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, సారిపల్లి బాబురావు, పోతల రాజప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ మంత్రిని కలిసిన ఉద్యోగులు

విజయనగరం: ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు సమీక్ష సమావేశానికి విజయనగరం వచ్చిన జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఇరిగేషన్‌శాఖ అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వై.ఆనంద్‌కుమార్, అధ్యక్షులు కె.వి.శ్రీధర్, జిల్లా ట్రెజరర్ ఎస్ రాము, ఆర్ శ్రీస్వప్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.గోపాలకృష్ణ, వైస్‌ప్రెసిడెంట్ జె.వి అప్పలరాజు, ప్రవీణ్‌కుమార్, పి.లత, ఎన్.శ్రీనివాసరావు, ఎస్‌బివి సన్యాసిరావు, ఎన్.రామకృష్ణ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రిని కలిసిన జలవనరుల శాఖ ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వ విధానాలతో పెన్షనర్లకు నష్టం

ప్రజాశక్తి - బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వ విధానాలతో పెన్షనర్లకు నష్టం జరుగుతుందని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామమూర్తి అన్నారు. బొబ్బిలి పెన్షనర్ల కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన ఆర్థిక బిల్లుతో పెన్షనర్లకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లకు ఒకసారి పే రివిజన్ చేసే సమయంలో ఉద్యోగుల వేతనాలతో పాటు పెన్షనర్లకు కూడా పెన్షన్ పెరుగుతుందని, ఆర్థిక బిల్లు ఆమోదంతో పెన్షనర్లకు పెన్షన్ పెరిగే అవకాశం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి ఒకటి నుంచి నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేసింద న్నారు. కేంద్రం తెచ్చిన బిల్లును రాష్ట్రంలో అమలు చేయకుండా పే రివిజన్ పెన్షనర్లకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కోరాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీని కోరుతామని చెప్పారు. ఈ సమావేశంలో పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు బి.సత్యనారాయణ, ఎల్.జగన్నాదం, పాల్గొన్నారు.

సీతంలో కార్యశాల

విజయనగరం : సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో నమూనా డిజైన్, అభివృద్ధిపై కార్యశాల నిర్వహించారు. కార్యశాలలో విద్యార్థులు భిన్నమైన డొమైన్‌లను అనుసరించడం ద్వారా కొత్త నమూనాలను ప్రదర్శించారు.జెఎన్‌టియు గురజాడ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. బాబులు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కొన్ని నమూనాలను అభినందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థు లందరూ ప్రస్తుత సాంకేతికతను అర్థం చేసుకుని, కొత్త నమూ నాలను తయారు చేయడానికి కృషి చేయాలని, కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ టి.డి.వి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి : డివిజి

ప్రజాశక్తి-విజయనగరం

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు.ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షి జాతులు అంతరిస్తున్న పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రధానంగా పిచ్చుకలు అంతరించి పోయే పక్షి జాతుల్లో మొదటి వరుసలో ఉన్నాయనీ,నగరీకరణ,పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి, పర్యావరణం వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోందని తెలిపారు. పక్షుల సంరక్షణకు ప్రధానంగా వేసవిలో వాటికి అవసరమైన వాతావరణ కల్పనకు విశాఖపట్నం కు చెందిన గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధులు మట్టి పాత్రలను పంపిణీ చేసారని వారి ప్రయత్నాన్ని అభినందించారు. ఎవరికి వారే స్వచ్ఛందంగా వారి ఇళ్లల్లో పక్షుల సంరక్షణకు ముందుకురావాలని, తాము కూడా పక్షుల సంరక్షణకు తమ ఇంట్లో మట్టి పాత్ర ను ఏర్పాటు చేసి అవి సేదదీరే ఏర్పాటు చేసామని తెలిపారు. పూర్వం మన ఇళ్లల్లో,పశువుల శాలల్లో చూరు కి వరి కంకులు వేలాడదీసే వారనీ,పిచ్చుకలు,ఇతర చిన్న పక్షులు హాయిగా వచ్చి చేరేవనీ తెలిపారు..ఆ అలవాటుని మళ్లీ మనం వాడుకలోకి తీసుకురావాలనీ,జీవవైవిధ్యం,జీవ సంరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కలిగించాల్సి ఉందని అన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

అనుమతులు ఉన్న అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం 37, 38 సచివాలయాల పరిధిలో కమిషనర్ ఆదేశాలతో ఆయన ఇతర ప్రజారోగ్య సిబ్బందితో కలిసి పర్యటించి పారిశుధ్య పనితీరుతో పాటు ట్రేడ్ లైసెన్సుల విధింపు ప్రక్రియను చేపట్టారు. ఆయా ప్రాంతాలలో ఖాళీ స్థలాలలో చెత్తాచెదారాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. కాలువలు కూడా అపరిశుభ్రతగా ఉండడాన్ని గమనించి మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆయా ప్రాంతాలలో ఉన్న పలు విద్యాసంస్థలు, కళాశాలల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్సలను విధించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని చినభంటుపల్లి ఎంపియుపి పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్‌లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో టీం వర్క్, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సమాజంలో ఏవిధంగా నడుచుకోవాలో తెలుసుకుంటారని, మన సంస్కృతి మీద అవగాహన పెంచుకుంటారని, బాధ్యతయుతమైన పౌరులుగా వెలుగుతారని అన్నారు. పిల్లలలో మానసిక అభివృద్ధి వ్యక్తిత్వ వికాశానికి, ఐక్యతకు వార్శికోత్సవ కార్యక్రమాలు ఉపయోగ పడతాయని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ బోడసింగి ఉమా, ఉపాధ్యాయులు జి. అప్పలనాయుడు, కె. త్రివేణి, బి.శ్రీదేవి, ఆర్. నారాయణరావు, వి. మోహనరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

డెంకాడ మండలంలోని గుణుపూరు పేట డంపింగ్ యార్డ్ ప్రాంతంలో తూర్పు వైపు ప్రహరీ గోడ నిర్మించేందుకు అవసరమైన అన్ని చర్యలనూ చేపడుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ డిఇ శ్రీనివాసరావు అన్నారు. ఇతర ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి మంగళవారం డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ తూర్పు వైపు ప్రహరీ గోడ నిర్మించనున్న నేపథ్యంలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన సూచనలు, సలహాలను సిబ్బందికి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.39 లక్షలతో డంపింగ్ యార్డ్ తూర్పు వైపు ప్రహరీ గోడ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 390 మీటర్ల నిడివి గల ప్రహరీ గోడ నిర్మాణానికై కౌన్సిల్ తీర్మానించిందన్నారు. దీంతో పనులు ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం కెజిబివిలో పదో తరగతి చదువుతున్న వృత్తి విద్య విద్యార్థులకు 12 రోజులపాటు సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అంతర్ శిక్షణ (ఇంటర్న్ షిప్) ఇచ్చారు. మంగళవారం అంతర్ శిక్షణ పొందిన విద్యార్థులకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీసేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఉన్నత చదువులకు ఈ శిక్షణ మంచి పునాదిగా ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుజాత కుమారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాల పట్ల ఆసక్తిని పెంచుతాయన్నారు. డీన్ డాక్టర్ సన్నీ డయాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జోగినాయుడు, వృత్తి విద్యా ఉపాధ్యాయులు తేజస్విని, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బహిష్కరణ దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో దళితులు సామాజిక బహిష్కరణ దుర్మార్గమని జై భీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ డిప్యూటి సిఎం నియోజకవర్గం మర్లాం గ్రామం దళితులను సామాజిక గ్రామ బహిష్కరణ చేయడం అగ్రకులాల దూరహం కారానికి నిదర్శనమని అన్నారు. గ్రామంలో దళితుడు మృతి చెందినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకోలేదని దీనిపై దళితులు మాట్లాడితే నిత్యావసర సరుకులు ఇవ్వకుండా అగ్రకులాల వారు హుకుం జరీ చేశారని గుర్తు చేశారు. బహిష్కరణ వల్ల దళితుల మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి దళితులను గ్రామ బహిష్కరణ చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేసి, దళితులకు రక్షణ కల్పించాలని కోరారు.

'సైన్స్ ఎక్షపోజర్ విజిల్'కు 160 మంది

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ఎలిమెంటరీ స్థాయికి చెందిన 160 మంది విద్యార్థులు మంగళవారం బయలుదేరి ఒడిస్సా రాష్ట్రంలోని రాయగడకు తీసుకువెళ్లారు. బస్సులను జెండా ఊపి జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఎపిసిఎ రామారావులు ప్రారంభించారు. ఈ సందర్శనలో భాగంగా మజ్జి గౌరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బయో టెక్నాలజీ విభాగం, మెకానికల్ విభాగం, ఎలక్ట్రికల్ విభాగం, మష్రూమ్ యూనిట్ సందర్శించి అనేక విజ్ఞాన విషయాలు తెలుసుకోవడం, నాగవళీ ప్లానిటోరియంలో 3డి షోను వీక్షణ చేస్తారు. జేకే పేపర్ మిల్స్ సందర్శిస్తారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ, ఎఎంఒ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయించడానికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆకుకూరలు, కాయగూరలు, పళ్ళను విక్రయించారు. ఈ కార్యక్రమంలో ఎపి సిఎన్‌ఎఫ్ సిబ్బంది, వెలుగు ఎఫ్‌పిఒ ఎపిఎం శైలేష్, కొనుగోలు దారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఇద్దరికి గాయాలు

గంట్యాడ: మండలంలోని కొండతమరాపల్లి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖ జిల్లా ఆరిలోవకు చెందిన దినేష్(22) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన గరికిన కార్తీక్, గద్దెపల్లి సింహాద్రిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ముగ్గురూ ఒకే మోటార్ బైక్ పై అనంతగిరి నుంచి విజయనగరం వైపు అతివేగంగా వస్తూ కొండతామరాపల్లి కూడలిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఖానాను బలంగా ఢీ కొట్టారు. దీంతో ముగ్గురూ చెల్లా చెదురుగా తుల్లి పడ్డారు. ఈ ఘటనలో మోటార్ బైక్ పూర్తిగా నుజ్జు నుజ్జయింది. ఘటనా స్థలంలోనే ఒకరు చనిపోగా మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న గంట్యాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుని క్షతగాత్రులు ఇద్దరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ సాయంతో మందుబాబులపై దాడులు

విజయనగరంకోట : విజయనగరం పట్టణం, వన్‌టౌన్, టూటౌన్ పోలీసు స్టేషను పరిధిలోని శివారు ప్రాంతాల్లో మంగళవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు డ్రోన్స్ సహాయంతో దాడులు నిర్వహించారు. 1, 2వ పట్టణ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఉడా కాలనీ, దుప్పాడ, అయ్యన్నపేట, గాజులరేగ, వైఎస్‌ఆర్‌నగర్, నారాయణపురం, బాబామెట్ట ఏరియాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిసుతన్న వారిపై డ్రోన్‌ను పంపి, కొంత మంది తాగుతున్నట్లు నిర్ధారించుకొని దాడులు చేశామని ఎస్‌పి జిందాల్ తెలిపారు. వన్‌టౌన్ పరిధిలో 12 మందిపై, టూ టౌన్ పరిధిలో 9 మందిపై కేసులను నమోదు చేసామన్నారు. పేకాట, ఓపెన్ డ్రింకింగు, ట్రాఫిక్ రెగ్యులేషను, జాతర్లు, దర్నాల నిర్వహణలో అనుమానస్పద వ్యక్తుల ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్ వినియోగిస్తున్నామని తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఇటీవల గంజాయి రవాణాలో నమోదైన కేసులో 5వ ముద్దాయిని గుర్తించి స్థానిక బైపాస్ జంక్షన్ వద్ద బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సిఐ వివరాలు ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కేసుకు సంబంధించి తప్పించుకొని తిరుగుతున్న ముద్దాయి కొర్ర యోగీశ్వరరావు అనుమానాస్పదంగా బైపాస్ రోడ్డు వద్ద సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడన్నారు. ఇతనిది ఎఎస్‌ఆర్ జిల్లా అల్లూరి మండలం కుర్రయిగూడగా గుర్తించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. నేరం రుజువు కావడంతో అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రసాదరావు, ఏఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.